కలుపు కష్టాలు

- వేధిస్తున్న కూలీల కొరత
- పెరిగిన ఖర్చులు
- వ్యవసాయం భారమవుతోందంటున్న అన్నదాతలు



ఈర్లపల్లి గ్రామ శివారులో కలుపు తీస్తున్న కూలీలు

దౌల్తాబాద్: వరుణుడు ఈ సారి కొంత ఇబ్బంది కలిగించినా.. కురిసిన వర్షాలకు రైతులు విత్తనాలు విత్తడంతో పొలాలు పచ్చదనంతో కళకళలాడుతున్నాయి. పత్తి, కంది, మొక్కజొన్న పంటల్లో కలుపు నివారణ పనులు జోరుగా సాగుతున్నాయి. గతేడాది కంటే కూలీ ఖర్చులు పెరగడంతో కర్షకులు ఆందోళన చెందుతున్నారు.

మండలంలో ఇలా..

దౌల్తాబాద్ మండలం దౌల్తాబాద్, అంతారం, నీటూరు, తిమ్మారెడ్డిపల్లి, చంద్రకల్, మటూరు, బిచ్చాల గ్రామాల్లో పత్తి అధికంగా సాగు చేస్తున్నారు. ప్రస్తుతం కలుపు నివారణ కోసం దంతెలు కొట్టడం పనులు జోరుగా సాగుతున్నాయి. కలుపు తీత పనులకు డిమాండ్ పెరగడంతో కూలీల కొరత ఏర్పడింది. రైతులకు కూలీ ఖర్చులు భారంగా మారాయి. పొలం పనులు చేసేందుకు దినసరి కూలీకి రూ.300–350 వరకు కూలి చెల్లించాల్సి వస్తోంది. పత్తిలో దంతె పట్టాలంటే ఎకరానికి రూ.వెయ్యి చొప్పున చెల్లిస్తున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎకరం పత్తిలో కలుపు తీయాలంటే రూ.6వేల వరకు అవుతోంది. స్థానికంగా కూలీలు రాకుంటే ఇతర గ్రామాల నుంచి రప్పిస్తున్నారు. రానుపోను రవాణా ఖర్చులు దాదాపు రూ.1000 వరకు అవుతుంది.

కూలీలకు డిమాండ్



గ్రామాల్లో రైతులందరికీ ఒకేసారి పనులు ఉండడంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. ఇతర గ్రామాల నుంచి తెప్పిస్తే అధికంగా డబ్బులు అడుగుతున్నారు. చేసిన కష్టం పనులు చేయించడానికే సరిపోతోంది. ఖర్చులు పెరగడంతో లాభం లేకుండా పోతోంది.

– భీంషప్ప, రైతు, బాలంపేట



అలుగు పారుతున్న కోట్‌పల్లి ప్రాజెక్టు

వృథా జలాలను సాగుకు మళ్లించండి

ధారూరు: కోట్‌పల్లి ప్రాజెక్టు అలుగు పోస్తుండటంతో నిత్యం 20 వేల క్యూసెక్కులకు పైగా నీరు వృథాగా కాగ్నా నదిలో కలుస్తోంది. అలా వృథా అవుతున్న జలాలను వానాకాలం పంటల సాగుకు మళ్లించాలని, ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వలతో పాటు బేబికెనాల్ తూముల ద్వారా కాల్వల్లోకి వదిలిపెడితే వరి పంటలకు మేలు చేకూరుతుందని అన్నదాతలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 2016 నుంచి ప్రాజెక్టు నిండి, వృథాగా నీరు కృష్ణా నదిలో కలిసి కర్ణాటక రైతులకు మేలు చేస్తుందని వారు పేర్కొన్నారు. వృథా నీటిని తూముల ద్వారా వదిలితే.. పరిసర ప్రాంత పంటపొలాలకు సాగు నీరు అంది.. రైతులకు ఉపయోగంగా ఉంటుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

రేవంత్‌ను కలిసిన నాయకులు



రేవంత్‌రెడ్డితో మద్దూరు నాయకులు

కొడంగల్: పలువురు నాయకులు ఆదివారం హైదరాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని కలిశారు. కలిసిన వారిలో మద్దూరు మండలం మాజీ ఎంపీపీ లక్ష్మీనారాయణరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నిడ్జింత సర్పంచ్ ఉన్నారు. లక్ష్మీనారాయణరెడ్డి గతంలో ఎంపీపీగా, రెండు పర్యాయాలు టీఆర్ఎస్ మండల అధ్యక్షుడిగా పనిచేశారు. మండలంలో బలమైన సామాజిక వర్గానికి చెందిన ఆయన.. అనుచరులు గెలుపోటములను ప్రభావితం చేస్తారని, త్వరలో కాంగ్రెస్‌లో చేరతారని ఆ పార్టీ నాయకులు తెలిపారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి కుటుంబంతో లక్ష్మీనారాయణరెడ్డి కుటుంబానికి సాన్నిహిత్యం ఉందని, త్వరలో ఆయన కూడా కాంగ్రెస్‌లో చేరబోతున్నట్లు తెలుస్తోంది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కొడంగల్ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి, కిష్టప్ప, చంద్రవంచ, సర్పంచ్ రఘు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎస్‌డీఎఫ్ నిధులతో గ్రామాభివృద్ధి



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ తదితరులు

యాలాల: ఎస్‌డీఎఫ్ నిధులతో గ్రామాలు అభివృద్ధి చెందుతున్నాయని బెన్నూరు సర్పంచ్ పటేల్‌రెడ్డి అన్నారు. ఆదివారం గ్రామంలో ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఎస్‌డీఎఫ్ నిధులతో అవసరమైన చోటా సీసీ, డ్రైనేజీలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లక్ష్మప్ప, మాజీ సర్పంచ్ మల్లికార్జున్‌రెడ్డి, గ్రామస్తులు శరణు భూపాల్, కై లా వెంకట్‌రెడ్డి, చంద్రారెడ్డి, నర్సిరెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరిన వారితో మాజీమంత్రి ప్రసాద్‌కుమార్

అనంతగిరి: వికారాబాద్ మండలం కొటాలగుడెం గ్రామానికి చెందిన పలువురు నాయకులు మాజీమంత్రి ప్రసాద్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ పీఏసీఎస్ డైరెక్టర్ వేమారెడ్డితో పాటు అతని అనుచరులు, నాయకులు పెద్ద ఎత్తున పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మాజీమంత్రి వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ చంద్రకళ, పార్టీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ కిషన్‌నాయక్, జిల్లా నాయకులు రత్నారెడ్డి, ఎర్రవల్లి జాఫ్, కమాల్‌రెడ్డి, గురువారెడ్డి, అనంత్‌రెడ్డి, పాతూర్ ప్రతాప్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, సంతోష్‌గౌడ్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలను కాపాడటంలో కేంద్రం విఫలం

మోదీ రాజీనామా చేయాలి: సీపీఎం



కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

కొడంగల్ రూరల్: మణిపూర్ ఘటనకు బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశ్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మహిళలను నగ్నంగా ఊరేగించడం దేశానికే సిగ్గుచేటని, శాంతి భద్రతలను కాపాడడంలో కేంద్రం విఫలం అయిందని ఆయన ఆరోపించారు. వెంటనే నిందితులను ఉరితీయాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బుస్స చంద్రయ్య, నాయకులు వెంకటయ్య, మహిపాల్, శ్రీనివాస్, బుగ్గప్ప, రామకృష్ణ, మంగమ్మ, సుదర్శన్, సతీష్, అంబేడ్కర్ సంఘం నాయకులు రమేష్, దస్తప్ప తదితరులు పాల్గొన్నారు.

నష్టపరిహారం ఇవ్వాలి: టీడీపీ

మొయినాబాద్: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం నష్టపరిహారం ఇవ్వాలని టీడీపీ నేత వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మొయినాబాద్‌లో మాట్లాడుతూ.. భారీ వర్షాల కారణంగా జిల్లాలో చాలావరకు కూరగాయలు, పూలు, ఆకుకూరలు, పత్తి, మొక్కజొన్న, జొన్న తదితర పంటలు దెబ్బతిన్నాయన్నారు. దెబ్బతిన్న పంటలను గుర్తించి రైతులకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు.

వర్షం బాధితులను ఆదుకుంటాం

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి



పరిగి: బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి: వర్షాలకు కూలిన ఇళ్ల బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం పరిగి మండలం సుల్తాన్ తండాలో హెమ్లా నాయక్ అనే వ్యక్తి ఇంటి పైకప్పు కూలిపోయింది. ఈ మేరకు ఎమ్మెల్యే.. బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఎడతెరిపి లేని వానలతో చాలా ఇళ్లు కూలిపోయాయని, త్వరలో ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందేలా కృషి చేస్తానని చెప్పారు. మెటల్‌రోడ్డుతో గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వం నుంచి రూ.1.40 కోట్లతో బీటీ రోడ్డును మంజూరు చేయించామని, త్వరలో పనులను ప్రారంభిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో దోమ జెడ్పీటీసీ నాగిరెడ్డి, పరిగి మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం..

కుల్కచర్ల: కుల్కచర్ల మండలం చెరువుముందలి తండా(ఎ)కు చెందిన జరుప్ల గోపినాథ్, వాల్యానాయక్ తండాకు చెందిన మాణిక్యనాయక్ మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించి, తక్షణ ఆర్థిక సహాయంగా చేరో రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గోబ్ర్యానాయక్, మాజీ ఎంపీటీసీ గాంగ్యానాయక్, బీఆర్ఎస్ చౌడాపూర్ మండల ప్రధాన కార్యదర్శి నర్సింహులు, నాయకులు సూర్యనాయక్, గోవింద్ నాయక్, తులసిరాం, స్థానిక నేతలు పాల్గొన్నారు.

చెన్నారెడ్డికి రేవంత్ పరామర్శ

కొడంగల్: కొడంగల్ మండలం రుద్రారం గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు చెన్నారెడ్డిని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. చెన్నారెడ్డి అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న రేవంత్.. ఆస్పత్రిలో ఆయన్ను పరామర్శించి, వైద్యులతో మాట్లాడారు. ఆయన వెంట ఆనంద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఆర్థిక సహాయం

పూడూరు: పూడూరు మండలం తిర్మలాపూర్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు నీలేష్ నాయక్ అనారోగ్యంతో కోమాలో ఉండి, నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న డీసీసీ ఉపాధ్యక్షుడు పెంటన్న బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సాయన్న, రాములునాయక్, గోపాల్, పరశురాం, రఫీ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయండి

ఎమ్మెల్యేకు నాయీ బ్రాహ్మణుల వినతి

శంకర్‌పల్లి: నాయీబ్రాహ్మణ సంఘం భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని శంకర్‌పల్లి నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శంకర్‌పల్లి మున్సిపల్ పరిధిలోని వివేకానంద కాలనీ పరిసరాల్లో గతంలో స్థలం కేటాయించడం జరిగిందని.. భవన నిర్మాణం కోసం ప్రభుత్వం తరుపున నిధులు మంజూరు చేయాలని కోరారు. శంకర్‌పల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్లు చంద్రమౌళి, శంకర్‌పల్లి నాయీబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు విజయభాస్కర్, ఉపాధ్యక్షుడు యాదగిరి, సభ్యులు నర్సింహులు, వెంటేష్, ప్రవీణ్, గోపాల్, రవి, రమేష్ పాల్గొన్నారు.

తండాకు తీరనున్న తాగునీటి సమస్య

ఎమ్మెల్యే సహకారంతో బోరు ఏర్పాటు: సర్పంచ్



తాగునీటి బోరు వేయిస్తున్న నేతలు

పెద్దేముల్: ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి సహకారంతో నెల్లితడ్డతండా తాగునీటి సమస్య తీరనుందని సర్పంచ్ చంద్రప్ప, ఎంపీటీసీ సీతాబాయి తెలిపారు. తండాలో మిషన్ భగీరథ నీరు సక్రమంగా సరఫరా కాక.. చేతి బోర్లు లేక గిరిజనులు వ్యవసాయ బావుల నుంచి నీరు తెచ్చుకుంటున్నారు. ఇదే విషయాన్ని బీఆర్ఎస్ నాయకులు రవి నాయక్, పాండునాయక్, చంద్రప్ప ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఎమ్మెల్యే.. తండాలో కొత్త బోరు, మోటార్‌కు రూ.2లక్షల నిధులు మంజూరు చేశారు. దీంతో తాగునీటి సమస్యకు పరిష్కారం లభించిందని వెల్లడించారు. మంబాపూర్, మారేపల్లితండాల సర్పంచ్‌లు శ్రావణ్‌కుమార్, పాండునాయక్, మాజీ సర్పంచ్ రవినాయక్, బీఆర్ఎస్ నాయకులు ముజీఫ్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నవగ్రహ, రుద్రహోమం



హోమంలో పాల్గొన్న బ్రాహ్మణులు, భక్తులు

కొడంగల్ రూరల్: అధిక శ్రావణమాసాన్ని పురస్కరించుకొని పట్టణశివారు గాడిబాయి శివాలయంలో ఆదివారం శంకర సేవా సమితి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కిట్టుస్వామి, బ్రాహ్మణులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శివలింగానికి రుద్రాభిషేకం, బిల్వార్చన, శివఅష్టోత్తర శతనామావళి, ధూపదీప నైవేద్యాలను సమర్పిస్తూ మంగళహారతులు పట్టారు. ఆలయ సమీపంలో వెలసిన ఆంజనేయ స్వామికి పంచామృతంతో అభిషేకం, సింధూర లేపనం, విశేష అలంకరణతో మంగళహారతులు పట్టారు. ఆలయ ప్రాంగణంలో నవగ్రహ హోమం, రుద్రహోమం చేశారు. అనంతరం విష్ణుసహస్త్ర నామ పారాయణం చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్ యాదవ్, అశోక్ కులకర్ణి, విశ్రాంత జీహెచ్ఎం శీలాదేవి, లక్ష్మీనారాయణజ్యోషి, సభాపతి కుటుంబసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతకు పూర్తి సహకారం

డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి



మనోహర్ రెడ్డిని సన్మానిస్తున్న ఆలయ కమిటీ నేతలు

కుల్కచర్ల: ఆధ్యాత్మిక కార్యక్రమాలకు తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. ఆదివారం కుల్కచర్ల మండలం హన్మ్యానాయక్ తండాకు చెందిన నాయకులు, అఖిల భారత బంజార సేవా సంఘం పరిగి నియోజకవర్గ అధ్యక్షుడు రాహుల్ నాయక్ ఆధ్వర్యంలో మనోహర్ రెడ్డిని కలిసి ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీఎంఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆధ్మాత్మిక కారక్రమాల నిర్వహణకు, ఆలయ నిర్మాణానికి తమవంతు ఆర్థిక సహాయాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రాంలాల్, రవి, సురేష్, నీల్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో విలీనం వద్దు



జీపీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

జనవాడ జీపీ గ్రామస్తుల నిరసన

శంకర్‌పల్లి: జనవాడ గ్రామాన్ని మోకిల మున్సిపాలిటీలో విలీనం చేయకూడదని శంకర్‌పల్లి మండల బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, జనవాడ గ్రామ వార్డుసభ్యుడు గౌడిచర్ల వెంకటేష్ ఆధ్వర్యంలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. గ్రామస్తులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. 'మున్సిపాలిటీ వద్దు.. గ్రామ పంచాయతీ ముద్దు' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మున్సిపాలిటీగా ఏర్పడితే ఎటువంటి అభివృద్ధి చెందదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపాలిటీలో విలీనం చేస్తే నాలుగింతల ఇంటిపన్ను పెరుగుతుందన్ని అన్నారు. జనవాడ గ్రామాన్ని గ్రామ పంచాయతీగా కొనసాగేలా చూడాలని కోరారు. అనంతరం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో జనవాడ ఎంపీటీసీ నాగేందర్, రాయదుర్గం పీఏసీఎస్ చైర్మన్ అరవింద్‌రెడ్డి, వైస్ చైర్మన్ నర్సింహ, ఉపసర్పంచ్ లలిత, కోఆప్షన్ సభ్యుడు గోపాల్ పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు కాంగ్రెస్ సంపూర్ణ మద్దతు

పీసీసీ ప్రధాన కార్యదర్శి శంకర్



ఆర్థిక సహాయం అందజేస్తున్న శంకర్

షాద్‌నగర్‌రూరల్: సమ్మెలో ఉన్న గ్రామ పంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లిశంకర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఎదురుగా గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మెకు ఆదివారం ఆయన మద్దుతు తెలిపారు. కార్మికులకు రూ.10వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. జీపీ కార్మికుల సమ్మెకు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని, సమస్యలను పరిష్కరించే వరకు కార్మికుల పక్షాన పోరాడుతామని అన్నారు. కార్యక్రమంలో బాబర్‌ఖాన్, బాల్‌రాజ్‌గౌడ్, చల్లాశ్రీకాంత్‌రెడ్డి, కొమ్ముక్రిష్ణ, కుమార్‌గౌడ్, ముబారక్, హలీం, శేఖర్, రాయికల్ శ్రీనివాస్, రఘుగౌడ్, వెంకటేష్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, రాములుయాదవ్, మనోహర్‌గౌడ్, సాయిలు, అంజద్, హైదర్‌గోరి, సీతారాం, మల్లేశ్, సురేష్, రాజు, నవీన్, సురేష్‌గౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి

కొందుర్గు: కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పేదల సంక్షేమం కోసమే పనిచేస్తుందని పీసీసీ ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్ అన్నారు. కొందుర్గు మండల కేంద్రంలో ఇటీవల కురిసన వర్షాలకు ఇళ్లు కూలిపోయి ఇబ్బందులు పడుతున్న బాధితులను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా వారికి ఆర్థిక సహాయంతో పాటు బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లపై విచారణ జరిపి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు నరేందర్, బ్లాక్ కాంగ్రెస్ వైస్ ప్రెసిడెంట్ యాదయ్య, నాయకులు మల్లేష్‌గౌడ్, రవీందర్, పద్మారావు, జీబీ కృష్ణ యూసుఫ్ పటేల్ ఉన్నారు.

బీఆర్ఎస్‌తోనే నియోజకవర్గ అభివృద్ధి

ఎమ్మెల్యే కాలె యాదయ్య



బాధితురాలికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల: నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పాటుపడుతానని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం సీఎం కేసీఆర్ జీఓ 111ను తొలగించి ఈప్రాంత ప్రజలకు మేలు చేశారన్నారు. నియోజకవర్గానికి రెండువైపులా ఉన్న ఈసీ, మూసీ వాగులపై బ్రిడ్జిలను నిర్మించి ప్రజల కష్టాలు తీర్చినట్లు చెప్పారు. ఈ ప్రాంత ప్రజలు నన్ను రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిపించారని.. ప్రభుత్వం ఈసారి కూడా నాకే ఇక్కడి టికెట్ కేటాయిస్తుందని, మరోసారి ప్రజలు ఆశీర్వదించాలన్నారు. మండల అధ్యక్షుడు ప్రభాకర్, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటరంగారెడ్డి, నాయకులు రమణారెడ్డి, క్రిష్టారెడ్డి, చంద్రశేఖర్, వెంకటేశ్, రాఘవేందర్‌రెడ్డి, గని, జంగయ్య తదితరులు ఉన్నారు.

పేదలకు అండగా ఉంటాం..

నిరుపేదలకు ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే యాదయ్య అన్నారు. చేవెళ్ల మండలంలోని దామరగిద్ద గ్రామంలో ఇటీవల కురిసిన వర్షాలకు కూలిన జేజ వినోద ఇంటిని ఆదివారం స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈసందర్భంగా సర్పంచ్ వెకంటేశంగుప్తా ఆధ్వర్యంలో బాధితురాలికి ఎమ్మెల్యే రూ.25వేలు, ఎంపీపీ విజయలక్ష్మి రూ.25వేలు వ్యక్తిగతంగా ఆర్థిక సహాయం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాధితులను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని చెప్పారు. త్వరలో ప్రభుత్వం అందించే గృహలక్ష్మి పథకం కింద ఇళ్లు అందించే ఏర్పాటు చేస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటరంగారెడ్డి, పామెన ఎంపీటీసీ సత్యనారాయణచారి, డైరెక్టర్ క్రిష్ణ, బీఆర్ఎస్ నాయకులు రమణారెడ్డి, క్రిష్టారెడ్డి, ప్రభాకర్, వార్డుసభ్యులు, గ్రామస్తులు ఉన్నారు.

'గాజీపూర్' పరవళ్లు



గాజీపూర్ వాగులో వరద ప్రవాహం

పెద్దేముల్: కుండపోత వర్షాలకు వాగులు, వంకలు వరదతో పరుగులు తీస్తున్నాయి. చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి. పెద్దేముల్ మండలం 30 రెవెన్యూ గ్రామాల్లో 52 చెరువులు, కుంటలు ఉన్నాయని, కురిసిన వర్షాలకు అవి 100శాతం నిండాయని మండల ఇరిగేషన్ ఏఈ నవీన్ తెలిపారు. గాజీపూర్ వాగు వంతెన పనులు పూర్తి కాకపోవడం, తాండూరు–సంగారెడ్డి మార్గంలో వాగు వచ్చే సమయంలో కోటపల్లి, మోమిన్‌పేట, సంగారెడ్డి, సదాశివపేట వెళ్లే ప్రయాణికులకు రవాణా కష్టాలు ఎదురవుతున్నాయి. వంతెన పనులు త్వరలో పూర్తి చేయాలని పరిసర ప్రాంత కోరుతున్నారు. ఇదిలా ఉండగా.. వరద నీటిలో పంటలు మునిగి రైతులకు అపార నష్టాన్ని మిగిల్చింది. పలు గ్రామాల్లో సుమారు 30కి పైగా ఇళ్లు కూలినట్లు రెవెన్యూ అధికారుల ద్వారా తెలుస్తోంది.

ప్రమాదకరంగా కల్వర్టు



శిథిలావస్థలో ఉన్న కల్వర్టు

పూడూరు: పూడూరు మండల కేంద్రానికి వెళ్లే దారిలో ఉన్న కల్వర్టు పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. ప్రస్తుతం తాత్కాళిక రోడ్డు మార్గం ఏర్పాటు చేసినప్పటికీ.. అది నిన్నమొన్నటి వర్షాలకు కొటుకుపోయింది. కల్వర్టు మార్గం గుండా ప్రయాణించాలంటే భయంగా ఉందని, అది ఎప్పుడు కూలి ఏం ప్రమాదం సంభవిస్తుందోనని పరిసర ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండల కేంద్రానికి డబుల్‌రోడ్డు మంజూరు అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని, త్వరగా రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.